కాంగ్రెస్ మానుకోట అభ్యర్థిగా బలరాంనాయక్

మహబూబాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోరిక బలరాంనాయక్‌ను ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. 2009లో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసిన బలరాంనాయక్ అప్పటి యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర సహాయక శాఖ మంత్రిగా పనిచేశారు. 2014లో తిరిగి ఎంపీ అభ్యర్థిగా టికెట్ లభించినా బీఆర్ఎస్ అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. 2018లో మహబూబాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి, 2019లో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి ఓటమిని చవి చూశారు. గతేడాదిలో అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి టికెట్ ఆశించినా దక్కలేదు. కాగా, శుక్రవారం ఏఐసీసీ విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో మానుకోట ఎంపీ టికెట్ పోరిక బలరాంనాయక్ లభించింది. కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి అత్యధికంగా 47 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో బలరాంనాయక్ టికెట్ దక్కడంతో మిగతా నాయకులు నిరుత్సాహంలో ఉన్నారు. ముఖ్యంగా లంబాడా హక్కుల పోరాట వ్యవస్థాపక అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్యనాయక్ టికెట్ ఆశించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా టికెట్ ఆశించి భంగపడ్డారు. ఇప్పుడు ఎంపీ స్థానానికి కూడా టికెట్ దక్కకపోవడంతో ఆయన భవిష్యత్ ప్రణాళిక ఏమిటనేది తెలియాల్సి ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోత్‌ను కవిత ఇప్పటికే బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రకటించింది. ఇక బీజేపీ అభ్యర్థి ఖరారు కావాల్సి ఉన్నది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తొర్రూరు, మార్చి8 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన గురువారం రాత్రి తొర్రూరులో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తొర్రూరుకు చెందిన బొమ్మగాని ఆదిత్యగౌడ్(21) బైక్‌పై వెళ్తుండగా, రాజ్యలక్ష్మి షోరూమ్ సమీపంలో మరో బైక్ ఎదురుగా వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆదిత్య కింద పడిపోగా, స్థానికులు ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. సీరియస్‌గా ఉండడంతో 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానాకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చిన్నగూడూరు, మార్చి 8: మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ పిల్లి వీరన్న శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రంగారెడ్డి, శ్రీశైలం, నర్సయ్య, శ్రీను, రమేశ్ పాల్గొన్నారు.

వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ దంపతులు

నర్సింహులపేట: రాజరాజేశ్వరి ఆలయంలో భక్తుల పూజలు

చిన్నగూడూరు: రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

కురవి వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్

శివోహం

- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

శివనామస్మరణతో జిల్లాలోని శైవ క్షేత్రాలు మర్మోగాయి. జిల్లా అంతటా మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం అంగరంగవైభవంగా జరిగాయి. ఎంతో నిష్టతో ఉపవాసం ఉన్న భక్తులు శైవాలయాలకు పోటెత్తారు. దైవ దర్శనం కోసం క్యూలో బారులు తీరారు. రాత్రంతా జాగారం చేసి శివుడి సేవలో తరించారు. మహబూబాబాద్ పట్టణం హనుమంతుడి కాలనీలోని శివాలయంలో, కేసముద్రం మండలం ధన్నసరి గ్రామంలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో, కాట్రపల్లిలోని శివాలయంలో, నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామంలోని శ్రీరామలింగేశ్వరాలయంలో ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ ప్రత్యేక పూజలు చేశారు. రామలింగేశ్వరాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మహబూబాబాద్, కురవి, కేసముద్రం, డోర్నకల్, గూడూరు, కొత్తగూడ, గార్ల, బయ్యారం, గంగారం, తొర్రూరు, నెల్లికుదురు, నర్సింహులపేట, మరిపెడ, దంతాలపల్లి, పెద్దవంగర, చిన్నగూడూరు మండలాలతోపాటు ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మార్చి 8

కురవి వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కేసముద్రం: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

గంగారం : గంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ప్రొఫెసర్ నారాయణ, ఆదివాసీ సంఘం నాయకులు

మహబూబాబాద్ రూరల్: శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, కమిటీ మెంబర్స్

బయ్యారం: కోటగడ్డ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

స్వామివారు ఎంతో మహిమాన్వితుడు

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి

కురవి, మార్చి 8 : మహాశివరాత్రిని పురస్కరించుకుని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ దర్శించుకున్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ.. వీరభద్రస్వామివారు ఎంతో మహిమాన్వితుడని, తమ ఇంటి కులదైవమన్నారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధిని సాధించిందన్నారు. మాజీ సీఎం, తండ్రి సమానులు కేసీఆర్ ఆయురారోగ్యాలతో జీవించాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, సీతామహాలక్ష్మి దంపతులు కేక్ కట్ చేసి సత్యవతిరాథోడ్‌కు తినిపించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఎంపీపీ పద్మావతి, జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, లాలయ్య, వెంకన్న, రాజునాయక్, శ్రీను, నరహరి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కురవి వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న ఎంపీ కవిత

కురవిలో వైభవంగా వేడుకలు

కురవి, మార్చి 8 : మహాశివరాత్రిని పురస్కరించుకుని కురవిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరభద్రస్వామి నామస్మరణలతో ఆలయం మార్మోగింది. ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, పాలకమండలి, ఆలయ ఈవో సత్యనారాయణ భక్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కాగా వీరభద్రస్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రూనాయక్, ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, సీతామహాలక్ష్మి దంపతులు, జడ్పీ చైర్‌పర్సన్ బిందు, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పద్మావతీ రవినాయక్, మండల అధ్యక్షుడు తోట లాలయ్య ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చే భక్తుల కోసం మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో సూర్యాపేట, ఖమ్మం, నర్సంపేట నుంచి ప్రత్యేకంగా బస్సులు నడిపించారు. డీఎంహెచ్‌వో అంబరీష ఆధ్వర్యంలో వైద్యసేవలందించారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ నేతృత్వంలో ట్రైనీ ఎస్పీ పండరీ చేతన్, డీఎస్పీలు తిరుపతిరావు, సురేశ్, సీఐ సర్వయ్య ఆధ్వర్యంలో 270 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కిక్కిరిసిన కల్యాణ ప్రాంగణం

మహాశివరాత్రిని పురస్కరించుకొని లింగోద్భవ కాలం (12:30 గంటలు, అర్ధరాత్రి తర్వాత శనివారం)లో లోక కల్యాణార్థం స్వామి, అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా జరుగుతుంది. గురువారం రాత్రి అంకురార్పణతో మొదలైన ప్రత్యేక పూజలు శుక్రవారం కొనసాగాయి. ప్రత్యేక శావలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని అందంగా అలంకరించగా, శుక్రవారం రాత్రి 7గంటలకు గ్రామ సేవకు బయల్దేరాడు. కల్యాణ వీరభద్రస్వామిని ఒక శావలో, భద్రకాళీ అమ్మవారిని మరో శావలో ప్రతిష్ఠించి ఆలయం చుట్టూ ప్రదక్షిణల అనంతరం గ్రామసేవకు తీసుకెళ్లారు. జీపీ వద్ద రెండు శావలు విడిపోయాయి. గ్రామంలోని గండిమైసమ్మ వద్ద రెండు శావల ఎదుర్కోలు కార్యక్రమం కనులవిందుగా జరిగింది. భక్తులు కాగడాల హారతులతో స్వామి, అమ్మవారిని ఆహ్వానించి తరించారు.

గూడూరు: శివకల్యాణంలో పాల్గొన్న భక్తులు

కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

నర్సింహులపేట, మార్చి 8: మండల కేంద్రంలో రాజీవ్‌యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలను డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ శుక్రవారం ప్రారంభించారు. యూత్ అధ్యక్షుడు దోమల యాదగిరిగౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్న ఈ క్రీడోత్సవాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా నిర్వహించాలన్నారు. గెలుపు ఓటములను సమానంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్, వెంకట్రాంనర్సయ్య, ప్రవీణ్‌రెడ్డి, భద్రయ్య పాల్గొన్నారు.

హక్కులు సాధించుకోవాలి

చిన్నగూడూరు, మార్చి 8: కేంద్రం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాపాడేందుకు సీఐటీయూ దేశ వ్యాప్త సమరశీల పోరాటాలు చేస్తుదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గునిగంటి మోహన్, సీఐటీయూ మండల బాధ్యులు రహీంపాషా, శ్రీనివాస్, ప్రశాంత్, ఏకాంబరం పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి ఒకరి మృతి

కేసముద్రం, మార్చి 8 : చింతచెట్టుపై నుంచి పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని కల్వల గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కల్వల గ్రామానికి చెందిన మహ్మద్ రహిమొద్దీన్ (52) తన ఇంటి ఆవరణలో ఉన్న చింతకాయ తెంపడానికి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి కిందపడి పోగా తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ చెందాడు. అతడికి భార్య సలీమా, ముగ్గురు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

కేసముద్రం, మార్చి 8: రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలైన ఘటన మండలంలోని కోరుకొండపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... గూడూరు మండలం అప్పిరాజుపల్లి గ్రామానికి చెందిన 10 మంది ఆటోలో కొమురవెల్లి మల్లన్న జాతరకు వెళ్తున్నారు. కోరుకొండపల్లి గ్రామం దాటిన తర్వాత మూలమలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మాన్యం మల్లేశ్, శిరీషకు తీవ్రంగా, వీరయ్య, సురావం, లక్ష్మీకి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

- మహిళలు, మహిళా ఉద్యోగులకు సన్మానం
- మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న వక్తలు

మహబూబాబాద్ రూరల్: మహిళలను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య

మహబూబాబాద్, మార్చి 8 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు రోడారి నాగేందర్ రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వికాస్ డిగ్రీ కాలేజీలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆర్టీసీ, మున్సిపల్, ఐసీడీఎస్, విద్య, ఆరోగ్యం రంగాల్లో రాణిస్తున్న జ్యోతిరాణి, శ్రీలత, పార్వతి, పద్మ, సుజాత, తులసమ్మ, అండాలు, హేమ, రమ, సునీ, ఆసియానాశ్రిన్, విజయకుమారి, జ్యోతిలను ఘనంగా సత్కరించారు.

మహిళలను గౌరవించాలి

మహబూబాబాద్ రూరల్: మహిళలను గౌరవించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని అమనగల్ పాఠశాలలో మహిళలను ఘనంగా సన్మానించారు. పుష్పకుమారి, నాగలక్ష్మి, ఎన్ఎం విజయ, రోజా, ఉపాధ్యాయుడు రమేశ్ పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

గార్ల: మండల కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, గ్రామ దీపికలు, వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆశవర్కర్లు, జడ్పీటీసీలను మండల నోడల్ అధికారి, లంబాడా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌జాదవ్ సన్మానించారు.

పెద్దవంగర: కుట్టుమిషన్, చెక్కులు అందిస్తున్న బీఎఫ్ఎస్ ప్రతినిధులు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

నర్సింహులపేట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బీఎస్పీ డోర్నకల్ నియోజకవర్గ మహిళ కన్వీనర్ జినక సువార్త కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల మహిళా కన్వీనర్ మహేశ్వరి అధ్యక్షతన మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నగూడూరు మండల మహిళా కన్వీనర్ ఒంగూరి స్వరూప, గ్రామ కన్వీనర్ పద్మ, నాయకురాళ్లు మంగమ్మ, సోమక్క, వెంకటమ్మ, ఉప్పలమ్మ, ఎర్ర సుగుణమ్మ, ఎల్లమ్మ, రేణుక, అనూష, సంధ్య పాల్గొన్నారు.

మహిళా శక్తితోనే సమాజాభివృద్ధి

పెద్దవంగర: మహిళా శక్తితోనే సమాజాభివృద్ధి సాధ్యమని బీఎఫ్ఎస్ సొసైటీ అధ్యక్షుడు పెదపూడి ప్రసన్నకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గంట్లకుంట గ్రామంలో బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ-2003 (బీఎఫ్ఎస్) కొడకండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారంతో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలకు రూ.10వేల విలువ చేసే కుట్టు మిషన్‌తోపాటు రూ.10వేల చెక్కులను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఎఫ్ఎస్ సొసైటీ ప్రతినిధులు అశోక్, రాజు, సంధ్యారాణి, మమత, సమ్మక్క, సౌజన్య, స్వరూప, గోపీ, నరేశ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లిలో వేడుకలు

దంతాలపల్లి : బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ర్యాలీ అనంతరం అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మహిళలను సన్మానించారు. సంస్థ కో ఆర్డినేటర్ శోభ, సిబ్బంది పాల్గొన్నారు.

గార్ల: మహిళలను సన్మానిస్తున్న నోడల్ అధికారి రాజుకుమార్ జాదవ్

13 నుంచి పద్మావతి, నర్సాపూర్ రైళ్ల హాల్టింగ్

మహబూబాబాద్ రూరల్, మార్చి 8 : 13 నుంచి నెక్కొండ రైల్వే స్టేషన్‌లో పద్మావతి ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్ స్టేషన్‌లో నర్సాపూర్ నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఉంటుందని ఎంపీ మాలోత్ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల వినతుల నేపథ్యంలో సికింద్రాబాద్ ప్రిన్సిపాల్ చీఫ్ ఆఫీసర్‌ను కలిసి సమస్యను వివరించామన్నారు. సికింద్రాబాద్ జోన్ రైల్వే ద్వారా అనుమతి లభించిందని, 13 నుంచి సేవలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ పేర్కొన్నారు.

11న 'గ్రీవెన్స్' రద్దు

మహబూబాబాద్, మార్చి 8 : ఈ నెల 11న గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రద్దు చేస్తున్నామని, వచ్చే సోమవారం ప్రజలు కలెక్టరేట్‌కు రావొద్దని పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

నెల్లికుదురు, మార్చి 8: విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందిన ఘటన మండలంలో జరిగింది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. జామతండాకు చెందిన గుగులోత్ నరేశ్, గుగులోత్ రవి శుక్రవారం రత్తిరాంతండాకు వెళ్లి గుగులోత్ రవి(45)ని చేపలు పట్టేందుకు తీసుకెళ్లారు. ముగ్గురు కలిసి బ్రాహ్మణకొత్తపల్లి శివారు ఆకేరువాగులో కరెంట్ షాక్ పెట్టి అక్రమ పద్ధతిలో చేపలు పడుతున్నారు. ఈ క్రమంలో రత్తిరాంతండాకు చెందిన రవి షార్ట్ సర్క్యూట్‌తో కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లగా, వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. తన భర్త మృతికి కారకులైన గుగులోత్ నరేశ్, గుగులోత్ రవిపై చట్టరీతా చర్యలు తీసుకోవాలని అతడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కేసముద్రం, మార్చి 8: కల్వల గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ శుక్రవారం పరామర్శించారు. ఏదునూరి లక్ష్మయ్య కుటుంబానికి, చుక్క ఎల్లయ్య కుటుంబానికి 50కిలోల చొప్పున బియ్యం అందజేశారు. గండి శ్రీనివాస్, సామల నర్సయ్య, దామరకొండ ప్రవీణ్‌కుమార్, మూరగుండ్ల అనంతరాములు, మోడెం వెంకటేశ్వర్లు, పెదగాని రవి, కొంతం శ్రీనివాస్, పొడేటి దినేష్, బొగ్గుల చంద్రం, వేల్పుల యాకయ్య పాల్గొన్నారు.

గార్లలో బాధిత కుటుంబానికి..

గార్ల: మండల కేంద్రలోని అంబేద్కర్‌నగర్ చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు కాగితపు వెంకటి (78) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా పీఏసీఎస్ చైర్మన్ దుర్గాప్రసాద్ వెంకటి కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, జిల్లా నాయకుడు సంజీవరెడ్డి ఉన్నారు.

మహిళల అభివృద్ధికి నాబార్డు చేయూత : ఏజీఎం

అవగాహన కల్పిస్తున్న ఏజీఎం చంద్రశేఖర్

తొర్రూరు, మార్చి 8: మహిళల ఆర్థిక అభివృద్ధికి నా బార్డ్ చేయూతనందిస్తుందని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎల్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని ఫత్తేపురంలో సాయి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు గొర్రెల పెంపకంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు వ్యవసాయ రంగంతోపాటు దాని అనుబంధ రంగాలైన గొర్రెలు, గేదెల పెంపకం ద్వారా ఆర్థిక అభివృద్ధిని సాధించాలని సూచించారు. మండలంలోని కంతాయపాలెం, మడిపల్లి, ఫత్తేపురం గ్రామాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫత్తేపురం ఎస్‌బీఐ మేనేజర్ కృష్ణప్రసాద్, మండల పశు వైద్యాధికారి వెంకన్న, సాయి స్వచ్ఛంద సంస్థ సీఈవో వెంకన్న, మహిళా రైతులు పాల్గొన్నారు.

మహిళా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

మహబూబాబాద్, మార్చి 8 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సందర్భంగా శుక్రవారం ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు తిరుపతమ్మ అధ్యక్షతన పట్టణంలోని బట్టు అంజయ్య భవన్ నుంచి మదర్‌థెరిసా సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సదస్సులో ఝాన్సీ మాట్లాడుతూ... పోరాడి సాధించుకున్న మహిళల హక్కులను కాపాడుకుందామన్నారు. మహిళల శ్రమను గౌరవించేలా, సంస్కృతిని పెంపొందించేలా పాఠ్య పుస్తకాలు ముద్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు మంద పద్మ, సామ రజిత, రమణమ్మ, స్నేహ, బిందు, సోమక్క, యాకూబ్, కవిత, అనిత, సునీత, 150 మంది మహిళలు పాల్గొన్నారు.

పార్టీ మారిన వారు పదవులకు రాజీనామా చేయాలి

తొర్రూరు, మార్చి 8: బీఆర్ఎస్ బీ ఫామ్‌లపై గెలిచి, రెండు రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్ రేవతీ శంకర్, మాధవీ అనిల్ తక్షణమే వారి పదవులకు రాజీనామా చేయాలని జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, గిరిజన సెల్ అధ్యక్షుడు జైసింగ్‌నాయక్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలోని 6వ వార్డు పరిధిలో శుక్రవారం రాయిశెట్టి వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహకారంతో బీఫామ్ పొందికారు గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన వారికి పదవుల్లో కొనసాగే నైతిక హక్కు లేదన్నారు.

సమావేశంలో జడ్పీటీసీ శ్రీనివాస్, నేతలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

VEHICLES FOR SALE

★AP36AT7382 Hymath Mohammad MARUTHI DZIRE Tour Diesel 5 Seater 2012, TS04EB-1575 SD Kalam MARUTHI SWIFT VDI Diesel 5 Seater 2014, గమనిక: ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును. Auction Date: 09-03-2024, Venue: Shriram Auto Mall India Ltd., Warangal. Cont: Shriram Finance Limited, D.No. 24-7-29, 1st Floor, Fathima Complex, Kazipet. 9989809938, 9989313186. NTW-14028

HMDA & RERA PLOTS

★3-5 సంవత్సరాలలో Future City భువనగిరిలో 200 ఎ|| AIIMS హాస్పిటల్ దగ్గర్లో HMDA & RERA ప్లాట్లు 60% లోన్‌తో గేటెడ్ కమ్యూనిటీలో కలవు: 8109994456. NT-320386

CHANGE OF NAME

I, YAKHOOBUNNISA BEGUM, W/o. TAHER HUSSAIN (New Name), previously called YAKHOOBUNNISA (Old Name), R/o. H.No. 16-11-382, Chintal, K.M. College, Warangal Dist-506007, T.S., India. solemnly declare.

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073. NT-311806

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభా